క్లుప్తంగా

నేడు ఆస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమంపై సమావేశం

పెనుగంచిప్రోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమంపై ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ మార్కపూడి గాంధీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అధికారులతో ఆలోచనా శిబిరం నిర్వహిస్తున్నామని హైదరాబాద్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(ఎన్ఐఆర్‌డీ) నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జీవీకే లోహిదాస్ హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులతో పాటు ఏఎస్ఎం, వీపీఏ, డబ్ల్యూఈఏ, వెలుగు సీసీ, అంగన్‌వాడీ కార్యకర్తలు అందరూ తప్పక పాల్గొనాలన్నారు.

తిరుపతమ్మ ఆలయంలో నిత్యాన్నదానానికి విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి బుధవారం మండలంలోని గుమ్మడిదూర్రు గ్రామానికి చెందిన వనజాక్షి కుమారుడు తరుణ్‌సాయి, కుమార్తె దీప్తి రూ.25,250 విరాళం ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ చేతుల మీదుగా అందజేశారు. గోశాలలో గోవుల సంరక్షణకు రూ.5,250 అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

పాఠశాలలో మొక్కలు నాటిన ఉపాధ్యాయులు



సుబ్బాయిగూడెం(పెనుగంచిప్రోలు): స్వేచ్ఛాహి సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో పలు రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 2 వరకు సమగ్ర శిక్ష అధికారులు పాఠశాలల్లో విధిగా మొక్కలు నాటాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణలో వేప, నేరేడు, మామిడి వంటి పండ్ల మొక్కలతో పాటు పలు పూల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం ఎం.ప్రభాకర్, ఉపాధ్యాయులు సీహెచ్ కవిత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యోగా అభ్యసనంతో రోగ నిరోధక శక్తి



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): ప్రతిరోజూ యోగా చేయటం వలన ఎముకల పుష్టితో పాటు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది తెలిపారు. పోషకాహార మాసోత్సవాలపై బుధవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగాతో పిల్లలు ఎత్తు పెరగటంతో పాటు బరువు కూడా ఉంటారన్నారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్య సేవలు

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): జగనన్న ఆరోగ్య సురక్షతో పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు ఇంటి వద్దనే అందుతాయని సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం అన్నారు. గ్రామంలో బుధవారం ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నందిగామ: పట్టణ పరిధిలోని రెండవ వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం బుధవారం పరిశీలించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. దోమల నివారణపై తీసుకుంటున్న చర్యలను ప్రజలకు వివరించారు.

తపాలా సేవలపై అవగాహన

నందిగామ: తపాలా శాఖ ద్వారా అందిస్తున్న సేవలుపై బుధవారం నందిగామ పట్టణంలో ఆ శాఖ సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తపాలా శాఖ ద్వారా అందిస్తున్న లైఫ్ ఇన్సూరెన్స్, ప్రమాద బీమా తదితర సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తపాలా శాఖలో పనిచేస్తున్న పలు స్థాయిల సిబ్బంది పాల్గొన్నారు.

గృహసారథులపై గురుతర బాధ్యత



గృహసారథులు, బీఎల్‌ఏల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్



జుజ్జూరులో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

- వచ్చే ఎన్నికలలో క్రియాశీలక పాత్ర
- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్
- జుజ్జూరులో వైఎస్సార్ సీపీ మండల కార్యాలయం ప్రారంభం

జుజ్జూరు(వీరులపాడు): రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం గృహసారథులు, బూత్ లెవల్ ఏజెంట్ల భుజ స్కందాలపై ఉందని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గృహ సారథులు, బీఎల్‌ఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ రాష్ట్రంలోని 87 శాతం కుటుంబాలకు మంచి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అని, గతంలో ఏ ప్రభుత్వం కూడా ఈ స్థాయిలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన దాఖలాలు లేవని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవలంబిస్తున్న సామాజిక న్యాయంతో అన్ని వర్గాలకు సమన్యాయం జరిగిందని తెలిపారు. డబుల్ ఎంట్రీ ఓట్లు, మృతులు, స్థానికంగా నివాసం ఉండని వారిని గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువచ్చి, ఆ ఓట్లు తొలగించేలా చూడాలని తెలిపారు.

పార్టీ కార్యాలయం ప్రారంభం

మండలంలోని జుజ్జూరు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయాన్ని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు ప్రారంభించారు. మండల పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటుకు తమ వంతుగా సహకరించిన షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగంను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, వైస్ ఎంపీపీ నాగులమీరా, సర్పంచ్ రమావత్ కోటి, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, నాయకులు పచ్చాల కోటేశ్వరరావు, శీలం రమణారెడ్డి, అయిలూరి నర్సిరెడ్డి, జంగా కోటిరెడ్డి, ఇప్పల సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



కె.అగ్రహారంలో డ్రైన్‌ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న విప్ ఉదయభాను

కె.అగ్రహారం(జగ్గయ్యపేట): నియోజకవర్గ అభివృద్ధికి ఈ ప్రాంతంలోని కర్మాగారాల యజమానులు దోహదపడాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. గ్రామంలో విశాఖ స్టీల్ ప్లాంట్ సహకారంతో రూ.38 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేయనున్న డ్రైన్‌ల నిర్మాణానికి స్టీల్ ప్లాంట్ జీఎం గౌతమ్‌తో కలిసి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని కర్మాగారాలు పట్టణ, గ్రామాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నాయన్నారు. కొన్ని కర్మాగారాలు గ్రామాలను దత్తత తీసుకుని వారికి కేటాయించిన సీఎస్ఆర్ నిధుల ద్వారా కూడా పలు కార్యక్రమాలు చేపట్టటం హర్షణీయమని తెలిపారు. పరిశ్రమలలో స్థానికులకు అర్హతను బట్టి ఉద్యోగాలు కల్పించాలని సూచించారు. గ్రామంలోని నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కంపెనీకి చెందిన మూడు వేల ఎకరాల భూమిలో మూడెకరాల స్థలాన్ని ఇవ్వాలని కోరారు. జీఎం మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధులతో గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని, మూడెకరాల స్థలం ఇచ్చే విషయం ప్లాంట్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అనంతరం ఉదయభానుతో పాటు గ్రామస్తులు స్టీల్ ప్లాంట్ యాజమాన్య ప్రతినిధులను సత్కరించారు. కార్యక్రమంలో ప్లాంట్ డీజీఎం రాజు, సర్పంచ్ ఆవుల శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ మూలగిరి కుమారి, కేడీసీసీబీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మండవ శ్రీనివాస్ గౌడ్, నాయకులు ఐదుమళ్ల నాగేశ్వరరావు, అనుమాల శ్రీనివాసరావు, నాగయ్య, పసుపులేటి శ్రీనివాసరావు, వీరబాబు, జ్వాలా, సైదా, ఎంపీడీవో రమేష్‌బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేపై ఆర్డీఓ సమీక్ష



నందిగామ: రీసర్వే కార్యక్రమం సకాలంలో పూర్తయ్యేలా చూడాలని ఆర్డీవో ఎ.రవీంద్రరావు సూచించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, సర్వేయర్లతో రీసర్వేకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి మండలంలో జరుగుతున్న రీసర్వేకు సంబంధించి సంబంధిత మండల అధికారులతో చర్చించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి గ్రామం పరిధిలోను భూముల రీసర్వే కార్యక్రమం సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. ముఖ్యంగా స్టోన్ ప్లాంటేషన్, గ్రౌండ్ ట్రూతింగ్ సకాలంలో పూర్తి చేయాలన్నారు.

నదిలో ఫంటు ఏర్పాటు



వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ సమీపంలోని కృష్ణానదిలో బుధవారం సాయంత్రం దేవదాయ, రెవెన్యూ, పోలీస్ అధికారులు ఫంటు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో జయప్రకాష్‌బాబు మాట్లాడుతూ కృష్ణానదికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వినాయక నిమజ్జనానికి విగ్రహాలకు వస్తుంటాయని భక్తుల సౌకర్యార్థం గజ ఈతగాళ్లతో నది మధ్యలోకి తీసుకెళ్లి విగ్రహాలను నిమజ్జనం చేసేలా ఫంటు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణబాబు, సర్పంచ్ గుడారు పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు చైర్మన్‌గా మానేపల్లి బ్రహ్మం

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా మానేపల్లి బ్రహ్మంను నియమిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను బుధవారం ప్రకటించారు. యార్డు చైర్మన్ ముత్తినేని విజయశేఖర్ గత నెల 28న అకాల మరణం చెందిన నేపథ్యంలో వైస్‌చైర్మన్‌గా వ్యవహరిస్తున్న బ్రహ్మంను చైర్మన్‌గా నియమిస్తున్నట్లు వెల్లడించారు. యార్డు అభివృద్ధికి చైర్మన్, సభ్యులు కృషి చేయాలని కోరారు. అనంతరం ఇటీవల టీటీడీ బోర్డు మెంబర్‌గా నియమితులైన ఎమ్మెల్యే ఉదయభానును మార్కెట్ యార్డు కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, మున్సిపల్ కౌన్సిలర్లు, దుర్గ గుడి డైరెక్టర్లు నంబూరి రవి, అల్లూరి భాస్కర్, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, మార్కెట్ యార్డు డైరెక్టర్లు, సెక్రటరీ జ్యోతి పాల్గొన్నారు.

ఘనంగా కొనసాగుతున్న గణపతి ఉత్సవాలు



నందిగామ ముక్కోటి మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సిద్ధి, బుద్ధి సమేత గణపయ్య



పెనుగంచిప్రోలు తూర్పు బజారున పూజలందుకుంటున్న భారీ గణనాథుడు

నందిగామ: నియోజకవర్గ వ్యాప్తంగా వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు బుధవారం నాడు చవితి పందిళ్లలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. పట్టణంలోని వాసవి మార్కెట్లో ఏర్పాటు చేసిన భారీ గణపతి విగ్రహం వద్ద విశేష పూజలతో పాటు పలురకాల హోమాది కార్యక్రమాలను నిర్వహించారు. ముక్కోటి మండపంలో ఏర్పాటు చేసిన పర్యావరణ గణపతి విగ్రహం వద్ద విశేష పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. వీటితో పాటు పట్టణంలోని మెయిన్ బజార్, పాత బస్టాండ్, రైతు పేట, నెహ్రూ నగర్, రామన్నపేట రోడ్డు తదితర ప్రాంతాలలో ఏర్పాటుచేసిన చవితి పందిళ్లలో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటుచేసిన చవితి పందిళ్ల వద్ద సామూహిక పూజా కార్యక్రమాలు జరిగాయి.

పూజలందుకుంటున్న గణనాథులు

పెనుగంచిప్రోలు: చవితి పందిళ్లలో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలకు బుధవారం మూడవరోజు విశేష పూజలతో పాటు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ వారి ఆలయంతో పాటు తూర్పు బజారున రామాలయం వద్ద, నవాబుపేటలో, అనిగండ్లపాడు, గుమ్మడిదూర్రులోని రామాలయం వద్ద ఏర్పాటుచేసిన నవరాత్రుల పందిరి వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కొనసాగుతున్న గణపతి ఉత్సవాలు

జగ్గయ్యపేట: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన మంటపాలలో బుధవారం గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేదాద్రి, కె.అగ్రహారం, బండిపాలెం, జయంతిపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలకు పలు రకాల అలంకరణలు నిర్వహించారు. పట్టణంలోని బ్రాహ్మణ బజార్‌లో ఏర్పాటు చేసిన గణనాథునికి పట్టణానికి చెందిన కటకం లక్ష్మీనరసింహ ప్రసాద్ గణనాథుని రూపంలోని ఐదు కిలోల లడ్డూను అందజేశారు.

ఎస్సీలంతా ఐక్యంగా ఉండండి

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్



ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఉదయభాను, ఎస్సీ ఐక్య వేదిక నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ భావజాలం స్ఫూర్తితో ఎస్సీలంతా ఐక్యంగా ఉండాలని, తద్వారా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం జగ్గయ్యపేట పట్టణానికి వచ్చిన ఆయనకు ముందుగా జాతీయ రహదారిపై ఫుడ్ ప్లాజా వద్ద నియోజకవర్గ దళిత సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక తొర్రగుంటపాలెం నుంచి ర్యాలీగా బయలుదేరి రైతు బజారు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ర్యాలీగా తరలివచ్చిన ఆయనకు విలియంపేటలో ఎస్సీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం క్రిస్టియన్‌పేటకు చేరుకుని అక్కడ ఉన్న రెండు అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు.

ఎస్సీల జోలికొస్తే సహించేది లేదు

తొర్రగుంటపాలెంలో నియోజకవర్గ దళిత సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ తొర్రగుంటపాలెంలో ఎస్సీ నిరుద్యోగ యువకుడు కరిసె మధు ఏర్పాటు చేసుకున్న ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్ చేపల దుకాణం జోలికి ఎవరు వచ్చినా సహించేది లేదన్నారు. సంబంధిత స్థలాన్ని ఆక్రమించాలని చూసే వారిపై కేసు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఎస్సీల భూములు కబ్జా చేసినా, వారిపై భౌతిక దాడులు చేసినా, ఎస్సీ స్త్రీల పట్ల అసభ్యంగా ప్రవర్తించి, అగౌరవపరచినా ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం విక్టర్ ప్రసాద్‌తో పాటు ఎమ్మెల్యే ఉదయభానును సన్మానించారు. ఎస్సీ నాయకుడు కరిసె మధు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ సూర్యారావు, మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, సీఐ జానకీరామ్, ఎస్ఐ రామారావు, హైకోర్టు న్యాయవాది అమృత నాగభూషణం, న్యాయవాదులు పారా రామారావు, నందిగామ రామారావు, ఎస్సీ నాయకులు గారపాటి వెంకన్న, గుంటూరు సోములు, పాలపాటి రవితేజ, శ్రావణం శ్యామ్, జమ్మి పుల్లయ్య, పణితి ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

కాలానుగుణంగా వ్యవసాయంపై సమాచారం అందించాలి

గరికపాడు(జగ్గయ్యపేట అర్బన్): రైతులకు కాలానుగుణంగా వ్యవసాయంపై తగు సమాచారం అందించాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ ఆర్.శారద అన్నారు. మండలంలోని గరికపాడు వద్ద ఉన్న డాక్టర్ కేఎల్ రావు కృషి విజ్ఞాన కేంద్రాన్ని బుధవారం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మి, వ్యవసాయ విస్తరణ సంచాలకుడు డాక్టర్ ఎ.సుబ్బిరామిరెడ్డి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంచాలకులు, కృష్ణా జోన్ డాక్టర్ జీఎంవీ ప్రసాద్ సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా కేవీకే లో ఉన్న అనేక విత్తనోత్పత్తి, కోళ్లు, మేకలు, గొర్రెల పెంపకం, ప్రదర్శన క్షేత్రాలను పరిశీలించారు. అనంతరం శాస్త్రవేత్తలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప కులపతి మాట్లాడుతూ రైతులకు కాలానుగుణంగా సమాచారం జీగురు అట్టలు, లింగాకర్షణ బుట్టలు, జీవన ఎరువుల అభివృద్ధి, పండ్ల తోటల మొక్కల పెంపకం, భూసార పరీక్షలు, చీడ, పీడల, వాతావరణ సమయానుకూల సమాచారం తగు సమయంలో రైతులకు చేరవేయాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.కృష్ణంరాజుకు వివిధ శాస్త్రవేత్తలకు సూచించారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్ర సిబ్బంది, వ్యవసాయ పరిశోధన స్థానం సిబ్బంది పాల్గొన్నారు.

పేదల కోసమే రాజన్న ఉచిత భోజనం

- ప్రభుత్వ విప్ ఉదయభాను
- 50 వ రోజుకు చేరుకున్న పంపిణీ కార్యక్రమం



భోజనాలను వడ్డిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాల స్ఫూర్తితో నిరుపేదలు, నిరాశ్రయులు, అభాగ్యుల కోసం స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద నిరంతరం కొనసాగే విధంగా రాజన్న ఉచిత భోజనం కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఈ కార్యక్రమం బుధవారంతో 50 వ రోజుకు చేరుకున్న సందర్భంగా జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ గౌస్ మొహిద్దీన్‌తో కలసి ఉదయభాను ప్రారంభించారు. పెనుగంచిప్రోలు మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా జీఎస్సార్, మారేపల్లి నాగేంద్ర, నడకుదుటి నాగరాజు వితరణతో చేపలు, రొయ్యలతో 1100 మందికి ప్రత్యేక భోజనాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు జిల్లా కార్యదర్శి షేక్ జుబేర్, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆకలి, అనారోగ్యం లేని సమాజ నిర్మాణమే ధ్యేయం

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



జుజ్జూరులో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జుజ్జూరు(వీరులపాడు): ఆకలి, అనారోగ్యం లేని జనాభా కలిగిన సమాజాన్ని నిర్మించటమే నిజమైన అభివృద్ధికి నిదర్శనమని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామ శివారు రంగాపురంలో బుధవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి అంటే భవనాలు, మిద్దెలు, మేడలు కాదని సామాన్య మానవుని జీవన ప్రమాణాల మెరుగుదలే నిజమైన అభివృద్ధి అని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుకనుగుణంగా పాలన సాగిస్తున్నారన్నారు. మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు పెద్దవరం విద్యార్థులు



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నందిగామ: మండలంలోని పెద్దవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో ఆడేందుకు స్థానం సంపాదించుకున్నారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. నందిగామ జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం అండర్ 14, అండర్ 17 విభాగాలలో నియోజకవర్గ స్థాయిలో ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలలో అండర్ 17 బాలికల విభాగంలో పెద్దవరం పాఠశాల విద్యార్థినులు నాగ హర్షిత, దివ్య, శిరీష, శ్రీలక్ష్మి, నవిత, జయశ్రీ, సబీరా ఎంపికై జిల్లాస్థాయిలో జరిగే పోటీలలో పాల్గొనేందుకు బుధవారం తరలివెళ్లారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

నిమజ్జనానికి బయలుదేరిన గౌరీ తనయుడు



నందిగామ పట్టణంలో నిమజ్జనానికి తరలి వెళుతున్న వినాయకుడు

నందిగామ: మండలంలోని పలు వినాయక విగ్రహాలు బుధవారం నిమజ్జనానికి తరలి వెళ్లాయి. మూడు రోజుల పాటు పూజలందుకున్న గౌరీ తనయుడు మేళ తాళాలు, కనక తప్పెట్లు, కోలాట నృత్యాల నడుమ నిమజ్జనానికి తరలి వెళ్లాడు. పట్టణంలోని పలు కూడళ్లు, బహుళ అంతస్తుల భవనాలలో ఏర్పాటుచేసిన గణనాథుడికి ఘనంగా వీడ్కోలు చెప్పారు. ఈ నేపథ్యంలో పలుచోట్ల సందడి వాతావరణం కనిపించింది.

పేదల సంక్షేమమే జగనన్న ఆకాంక్ష


ప్రభుత్వ విప్ ఉదయభాను



మిట్టగూడెం యానాదికాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక 11 వ సచివాలయం పరిధిలోని 24 వ వార్డులోని మిట్టగూడెం, యానాది కాలనీ, మసీదు బజారు తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ప్రజలకు సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేస్తూ ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొందరు ఇంటి స్థలం ఇప్పించాలని, పక్కా గృహాలు కావాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. వివిధ పథకాల ద్వారా తమకు లబ్ధి చేకూరిందని పలువురు మహిళలు హర్షం వ్యక్తం చేశారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నను గెలిపించుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కుంచపు నారాయణ, కౌన్సిలర్లు సాధుపాటి రాజు, దువ్వల రామకృష్ణ, పార్టీ బీసీ విభాగం అధ్యక్షుడు గుంజ లక్ష్మణ్, సచివాలయం కన్వీనర్లు కనిగిరి సుబ్బారావు, దుర్గ, స్థానిక నాయకులు గుంజ రోశయ్య, గురవయ్య, బత్తుల నరసింహారావు, దేరంగుల బుజ్జి, ఉప్పుతోళ్ల నరసింహారావు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి'



జగ్గయ్యపేటఅర్బన్: ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్ సమావేశాల్లో చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ కూచిపూడి సత్యం మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని, లేకపోతే బీజేపీకి తగిన బుద్ధి చెపుతామని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ మంద పిచ్చయ్య మాదిగ, నియోజకవర్గ కన్వీనర్ సీహెచ్ గోపి, వత్సవాయి మండల కన్వీనర్ బొబ్బిళ్లపాటి నాగరాజు, మల్లాపురం సర్పంచ్ అంబోజి జాన్, మాజీ సర్పంచ్ బి.ప్రసాద్ పాల్గొన్నారు.